కథ

'మనిషన్నంక కాస్త సిగ్గుండాలె... పంచాతి పెద్దరంట పంచాతి. రానియ్య రాదు. ఏ పెద్ద మనిషి వొస్తడో ఏం చెపుతడో..'
సుగుణమ్మ పొద్దున లేసిన దగ్గర నుంచి చిటపట లాడుతున్నది. ఆమె గుండె రగిలిపోతున్నది. ఆమె మాటలు తల్లి శాంతమ్మ వింటనే ఉంది. కొడుకుల ప్రవర్తనకు ఆమె ఉడికిపోతున్నది. సుగుణమ్మ చాయ గ్లాసు తీస్కపోయి భర్త రాంకిషన్‌రావు చేతికి అందించింది. ఆయన తోటకాడికి పోయి అప్పుడే వచ్చిండు. ముందు అర్రల మంచం మీద జారగీల బడి టీవి చూస్తున్నడు.

# అమ్మ యాదికొచ్చింది

- ఎలికట్టె శంకర్‌రావు

రాంకిషన్‌రావు చాయి తాగుతుంటే ' ఆల్లకు మనకు సుట్టిర్కాలేం లేవు. గాడిద కొడుకులు నోటి కొచ్చినట్టు మాట్లాడితే నువ్వేం ఊకోవాల్సిన పని లేదు. పంచాతి పెట్టినోని మీద పావురమేంది.' తమ్ముండ్ల గురించి చెప్పింది సుగుణమ్మ.

రాంకిషన్‌రావు మనసు నిండా ఆలోచనలు. భైటికేం మాట్లాడలేదు.

లోపటి అర్రల గడపకాడ కూసోని వింటుంది శాంతమ్మ.

ఇయ్యాల తన కొడుకులు .... అల్లున్ని బిడ్డను ముద్దాయిలుగా చేస్తుంటే భరించ లేకపోతున్నది. కొడుకుల తల్చుకుంటే అరవైయేండ్ల శరీరం భయానికో అసహ్యానికోగాని వణుకుతున్నది.

దీనికంతటికి కారణం తనేకదూ! తనేనా! శాంతమ్మ ఆలోచనలు పదేండ్ల వెనకకు పోయినయ్.

నల్లగొండకు నార్కట్‌పల్లికి నడుమ రోడ్డు పక్కన కొండ కిందిగూడెం. తను పుట్టింది అక్కన్నే. ఊర్ల సంబంధమే. సంసారం చేసింది అక్కన్నే. ఇద్దరుకొడుకులు, ఓ బిడ్డ.

ఉండిలేని సంసారం . ముగ్గురు పిల్లల సాదడమే గగనమైపోయింది. పాలుకొచ్చింది ఏడెకరాలు. పసుపుకుంకుమల కింద తన తండ్రి ఇచ్చింది రెండకరాలు. అదీ ఒట్టి సౌట నేల. ఓ పంట పండేది కాదు. తిండి పెట్టేది కాదు. తన పెనిమిటి కన్నమ్మ కష్టాలు పడ్డడు. ఎట్ల గడిసిందో ఏమో సంసారం.... ఆ దేవునికే ఎరుక. పిల్లలు సర్కారు బల్లె సదువుకుండ్రు. పెద్ద మనిషైన రెండేండ్లకే బిడ్డ పెండ్లి చేసింది. మంచి సంబంధం పోతే దొరకదని.అప్పుడే ఉన్న ఐదెకరాలు అమ్మాల్సి వొచ్చింది. పెద్దోనికి సదువు అబ్బలే . పద్దైనంక రాజకీయాలు గొడవలని వాడెప్పుడు ఇంటి పట్టున ఉన్నోడు కాదు. చిన్నోని గీత బావుండి పంతులు ఉద్యోగమొచ్చింది. అయ్యాల తన భర్త ఎంత సంబూరపడ్డడని !

ఎదిగొచ్చిన కొడుకులకు సంబంధాలు నడిచొచ్చినయ్. ఇద్దరికి పెండ్లిండ్లు అయినయ్.

అసలు కత అప్పుడు మొదలైంది.

చిన్నోడు సుదర్శన్ నల్లగొండలో కాపురం పెట్టిండు. పెండ్లమొచ్చినంక వానికి ఇంటి మీద ధ్యాసే పోయింది.

పెద్దోడు కమ్యూనిస్టోల్ల వెంట తిరిగిండు. ఇంగ దాంట్లనే ఆని బతుకు. యాడ గొడవలైనా వాడే . వానికీ పెండ్లం పిల్లలే లోకం. అమ్మ య్య యాదికి రాకుంట అయ్యిండ్రు. ఇద్దరు కొడుకులు ఉన్నారనే గని అమ్మయ్య ఉండ్రా సచ్చిండ్రా అని పట్టించుకోవటమే మరిచిండ్రు.

తన భర్తకు కాళ్లు రెక్కలాడినంత కాలం ఇబ్బంది అనిపించలే. వొయిసు మీదపడే సరికి విషపు నీల్లకు నడుములు కట్టె సర్సినట్టైంది. పని చేయలేని పరిస్థితి. అప్పుడు మొదలైనయ్ తమ కష్టాలు.

ఏం తినాలె ఎట్ల బతకాలె. నెలల తరబడి మొకం చూపించటం లేదు కొడుకులు.

ఒక నాడుచిన్నోడు సుదర్శన్ ఇంటికి ఇద్దరాలు మొగలు పోయింండ్రు. ఆదివారం పూట ఇంటిపట్టున్నే ఉండు. కోడలు కూడా ఉంది. తిని నిమ్మలపడ్డంక తనే అడిగింది.

'దర్శయ్యా నువ్వా నౌకరి చేస్తుంటివి. పెద్దోడు... ఆని సంపాదన ఆనికుండె. మీ పెండ్లం పిల్లలు తిని నిమ్మలంగ ఉంటుండ్రు. ఉండాలె కాడకా . మరి మా సంగతేందిరా? మీ నాయనకు శాత గాకుంట ఆయె. మరి మాకు తిండెట్ల? నీల్లెట్ల ? ఇద్దరు కొడుకులుంటిరి? తిండికి సంపుతాంరా ' అని వొలవొల కార్చింది తను.

'ఇప్పుడేమయ్యింది. ఏం కష్టమొచ్చింది' దర్శయ్య అచ్చం కడుపు నిండినోని లెకన్నే మాట్లాడిండు.

'అదేంది కొడుకా మా తిండి ఎట్లెల్తది ? నువ్వు మల్లిసూడవైతివి. పెద్దోడు మల్లిసూడడాయే. ఓ పావుల ఇయ్యరైతిరి, బేడ ఇయ్యరైతిరి.' కడుపులో ఇన్నాళ్లు దాచుకున్న దుక్కం పొంగింది.

పెద్ద మనిషి మాట పడిపోయినట్లుగా కూసుండు.

తన మాటకు చిన్నోనికే రోషం పొడుసుకొచ్చింది.

'నేనొక్కన్నేనా? అన్నలేడా ! ఆయన నెందుకు అడగరు. ఆయనేమిస్తే అదే నేనిస్త . మమ్ముల బదనాం చేయొద్దు' అని కరుగ్గా అన్నడు.

అడ్డాల నాటి నుంచి గడ్డాల దాంక సాది సంబాలించిన కొడుకు అమ్మయ్యని కూడా చూడకుంట

అట్ల మాట్లాడుతుంటే పానం గరుగ్గుమన్నది. ఉన్న ఫలంగా ఊపిరిపోతే బావుండు అనిపించింది.

ఇంక అక్కడ ఉండ బుద్దికాలె. సగం సచ్చిన పానాలతోని పెద్దోని ఇంటికి పోయిండ్రు. అక్కడా అంతె...

పెద్దోడు కాస్త నోరు పెంచి‘ ఏం సంపాయించిండ్రు మీరు. ఓ మీరు మూటలు కట్టిస్తే మేము తిని సుఖ పడుతున్నాం? ఇంగ మేమే నెలనెలా ఇయ్యకపో యినాం’ అన్నడు మొకం మీదనే.

కన్న కొడుకులే గదా అన్నది అని కడుపుల పెట్టుకొని ఇంటికి చేరిండ్రు.

ఒక దిక్కు కొడుకుల ప్రవర్తన... ఇంకో దిక్కు తిండి గింజల కోసం తిప్పలు ...పాణాలు అరిచే తుల్లపెట్టుకొని గడిపిండ్రు.

ఈ సంగతి తెలిసి తన బిడ్డ పెనిమిటిని వెంటబెట్టుకొని వొచ్చింది.

‘అదంతా పట్టించుకోకురి. ఆల్లే మనసు మార్చుకుంటరు. ఆల్లే సాదుకుంటరు’ అన్నది. అల్లుడు కూడా ధైర్యం చెప్పిండు. పోయేటప్పుడు ఖర్చులకు ఉంచు అని ఇంత చేతుల పెట్టిండ్రు. ఆడబిడ్డ సొమ్ము తినాల్సి వొచ్చినందుకు దుక్కం పొంగుకొచ్చింది. పక్క నున్న చెరువుగట్టు రామలింగాలస్వామి మీద దుమ్మెత్తి పోసింది.

నెలలు గడిచినా కొడుకుల మొకాలు కనిపించలే. కుక్క ఆశ గుండ్రాయితో పోయినట్లు ఇంక కొడుకులు సాత్తరన్న ఆశ సచ్చింది.

ఓసారి బిడ్డ వచ్చింది. ‘ అమా! ఇంకెందుకు ఈడ? ఈ పాతి ల్లునే పట్టుకొని యాలాడుడు. ఆల్లా తాగిన పాదుగును మర్సిపో యిండ్రు. ఈ వొయిసుల మనసు ఇంత కష్టపెట్టుకోవాల్నా రారీ మా ఇంటికి. మాతో పాటే ఇంత తినురి. నాకేం బారం కారులే’ అన్నది.

ఆడ బిడ్డ... దానికి పావురం ఉండి అట్లన్నది. అయినా తాము ఎట్లపోతరు. బిడ్డింటి మీద పడి తింటుండ్రంట అంటె ఎంత నావర్ద. అయినా ఆడ బిడ్డను ఒకింటికిచ్చి ... దానింటికి ఎట్ల పోతరు?

అదే మాట సుగుణమ్మతో అన్నరు. సుగుణమ్మ రొండొద్దులకే భర్తను తీసుకొని వొచ్చింది. ముసలితనాన ఇంకోతోవ కనిపించ లేదు.

అట్ల ఎర్రగూడెం చేరిండ్రు. ఇది జరిగి పదేండ్లయింది. యాడాది కిందనే పెద్ద మనిషి కూడా కాలంజేసిండు.

‘అమ్మా ఒకటే మనాది పెట్టుకోకు. ఇంత కాలంలేని దిగులు



ఇయ్యాలెందుకు? లే.. లేసి ఇంత తిను అసలే ఎండ కాలం. యాల్ల దప్పితే గేరొచ్చినట్టయితది.

గడవట్ల కూసొని ఆలోచిస్తున్న శాంతమ్మ బిడ్డ మాటకు తేరుకుంది.

***

కొడుకులకు ఇయ్యాల పుట్టింది అమ్మమీద పావురం. ఇంత కాలం యాడ పండుకుండ్రో ? లోపల ఆలోచనలు బైటికే అన్నది సుగుణమ్మ. ఆమె మనసు సద్దగట్కోలేక తుకతుక ఉడుకుతున్నది.

పదిహేను ఇరవై రోజులయ్యింది. చిన్నోడు సుదర్శన్ వచ్చిండు. అయ్యాల వాని మొకం చూస్తెనే అసహ్యమేసింది తనకు. అమ్మయ్యకు కూడు పెట్ట నోల్లు కూడా మనషులేనా అనుకుంది. థూ అని మొకం మీద ఉయ్యలేకపోయింది అంతే... తండ్రి సచ్చిపోయిండని తెలిసిన్నాడు కూడా ఏదో మొక్కుబడిగా వొచ్చిండ్రు ఇద్దరు అన్నదమ్ములు. ఎంత తొందరగా బైట పడదామా అని చూసిండ్రు.

'మా ఊల్లె మాత్రం ఏముంది. ఈన్నే కానియిరి దహనం' అన్నరు.

బతికున్ననాడు కూడు పెట్టలేదుకాని తండ్రి సచ్చిన్నాడు మాత్రం ఖర్చులకని ఇయ్యబోయిండ్రు. తన భర్త సుతి మెత్తగా వొద్దన్నడు.

'నాలుగొద్దులు ఈడ బతికిండు. పోయిండు. కార్యం ఖర్చులు కూడా పెట్టుకుంటలే 'అన్నడు.

అయిదారేండ్ల కిందనైతే అంత ధైర్యం చేసేటోడు కాదేమో. కాని బత్తాయి తోట చేతికొచ్చినంక సంసారం గాడిన పడ్డది. పైస ఉసులు బాటుంది.

అప్పుడు పోయినోల్లు మల్ల పదిహేను రోజుల కింద వొచ్చిండ్రు. ఎందుకు? అమ్మ మీద పావురం పుట్టిందంట. తీసుకుపోతరంట.

'ఎంతకాలం ఉంటవు బిడ్డకాడ ? మా దగ్గరికి రామా' అన్నడు సుదర్శన్ అయ్యాల.

అదేదో కలోలిగనే అనిపించింది. అమ్మ శాంతమ్మ మాత్రం ఆ మాటలు నమ్మలే. అసలు మాట్లాడటానికి కూడా ఇష్టపడలే .

'అక్కా మీ ఇంటి మీద ఎంతకాలం ఉంచుకుంటవ్? మా కాడ ఉంటె మాకు మాత్రం తృప్తి ఉండదా? అయ్యాల నువ్వు తీసుకొచ్చినవని సరేలే అనుకున్నం కాని మా కాడ అమ్మ ఉండాలని మాకుండదా? నలుగురు నాలుగు మాటలంటుంటే మాకు చిన్న తనంగ అనిపిస్తుంది' అన్నడు.

వాని మాటలు బాగున్నా ఎందుకు మార్పు వచ్చిందో అర్థం కాలే.

సుదర్శను వాళ్ల బావను కూడా అడిగిండు. ఆయన 'మీ అమ్మ ఇష్టం. మీరు సాదుకుంట అంటే అంతకంటే సంతోషమేమున్నది అన్నడు.

కాని అమ్మనే ససేమిరా అన్నది.

'పదేండ్ల కింద తెగిపోయిన బంధం. ఇయ్యాల గుర్తొచ్చిందా అమ్మ. మంచో చెడో బిడ్డింటికొచ్చిన. ముసలోడు ఈడనే కాలం జేసిండు. రేపో ఎల్లుండో నేను... అమ్మను సాదిందన్న పేరు బిడ్డకే రానియి. మీకెందుకు కొడకా అంత బరువు' అన్నది.

సుదర్శన్ ఎంత బతిలాడినా వినిపించుకోలే శాంతమ్మ .

'నువ్వు తోలితెనే వస్తది. అంతా నీకాన్నే ఉంది కిటుకు' అని బావ మీదికి లేసిండు సుదర్శన్ అసహనంగా.

తనకు మండిపోయింది. ఇంకాలం సాదింది కాక వీనితోని మాటలా? చెడామడా వాయించింది.

వాడు చివరికి అసలు రూపాన్ని చూపించిండు.

'రొండెకరాలు ఉందిగా అది దోసుకుందామనే మీ ఉపాయం' అన్నడు.

తనకు పట్టరాని కోపమొచ్చింది.

'ఇంకొక్క మాటన్నవంటె తమ్ముడని కూడా చూడను. ఎల్లు నా యింట్ల నుంచి' అన్నది.

'మీ ఆటలు ఎట్టెట్ట సాగుతయో చూస్త ' అని వెల్లిపోయిండు.

ఆ తర్వాత ఆయన చెప్పిండు.

'మీ అమ్మ పేరు మీద రెండకరాలు ఉందిగా. దాని పక్కనే కాలనీ కడుతుండ్రంట. అక్కడ బెటాలియన్ పడ్డప్పట్నుంచి భూముల ధరలకు రెక్కలొచ్చినయ్. ఇప్పుడు కాలనీ...ఆ పక్కన్నే రెండెకరాలుంది. వెయ్యి రూపాయలకు గజం పలుకుతుందంట. అంటే యాభై లక్షలకు ఎకరం.'

తన తమ్ముండ్లకు అమ్మ ఎందుకు యాది కొచ్చిందో అర్థమైంది. వాళ్ల మీద మరింత అసహ్యమేసింది.

ఇయ్యాల పెద్ద మనుషుల తీసుకొని వస్తమని చెప్పి పంపిండ్రు.

సుగుణమ్మకు ఇంటి ముందు అలికిడి అయ్యేసరికి తేరుకుంది.

అన్నదమ్ములు ఇద్దరు వొచ్చిండ్రు. ఇంకో నలుగు రైదుగురు పెద్ద మన్సులు. పెద్దోనితోపాటు సంఘంల పని చేస్తోల్లు.

రాంకిషన్‌రావు వచ్చినోల్లను పలకరించిండు. సుగుణమ్మ రుసరుసలాడుతున్నా ఇంటికొచ్చినోళ్లను మర్యాదగా చూడాలే అన్నడు .

సుగుణమ్మ గంపెడు కోపాన్ని దిగమింగింది.

'రాంకిషన్‌రావు గారు ఏంది పంచాతీ' ఒక పెద్ద మనిషి అడిగిండు.

రాంకిషన్‌రావు తేలికగా నవ్విండు.

'వాళ్ల అమ్మను తీసుకపోవడానికి పంచాయతీ ఎందుకు? పెద్ద మనిషి పోతంటే నేను వద్దంటనా? తీసుకపోండి' అన్నడు.

శాంతమ్మ గోడవారగా కూసుంది. కొడుకుల మాటలు, పెద్ద మనుషుల మాటలు వింటుంది. అంతా శాంతమ్మ నిర్ణయానికి వదిలిపెట్టిండ్రు.

'ఏమమ్మా కొడుకులకాడ ఉండాల్సిన దానివి బిడ్డకాడ ఉంటున్నవ్. కొడుకు లొచ్చి రమ్మన్నా రానంటున్నవంట. తల్లిని సాత్తలేరన్న బదనాం రాదా వాళ్లకు' సంఘపాయిన అన్నడు.

'ఎక్కడ కొడుకులు ఏంకత. ఆల్లు నా కొడుకులే అయితే ఇంత కాలం నా బిడ్డింట్లె ఎందుకుంట' అన్నది శాంతమ్మ.

'అట్లంటే ఎట్ల ? కోపతాపాలు ఉంటయ్. అంత మాత్రాన కొడుకులు కొడుకులు కాకుంట పోతరా ఏంది' మల్లా ఆయనే అన్నడు.

'అయ్యా మీరు ఎన్నన్న చెప్పురి. ఆల్లు నా కొడుకుల కాదు. నేను తల్లిని కాదు . కొడుకైనా బిడ్డైనా నాకు బువ్వపెట్టినోల్లే ' అన్నది.

సుదర్శన్, వెంకటేశ్వర్లు తల్లి అట్ల మాట్లాడుతుంటే అసహనంగా ఉండ్రు. ఇంక తల్లి తమ మాట వినదని అర్థమైంది.

'దీనికంతా ఇత్తనం పెట్టింది ఈయన. ముసల్దానికింత బువ్వపెట్టి రెండకరాలు దొబ్బాలనుకుండు. ఇయ్యాల ధరలు పలికినయ్ కదా. దాని మీద బడ్డది కన్ను ' వెంకటేశ్వర్లు నోరు పెంచి అన్నడు.

రాంకిషన్‌రావు వొల్లు మండిపోయింది. ' అన్నం తింటున్నవా గడ్డి తింటున్నవా? ఏమాటలు అయ్యి. మీరు సొక్కమైనోళ్లు అయి బువ్వ పెడితే నాయింటి మీదికి ఎందుకొస్తరు? పదేండ్ల నుంచి సిగ్గు శరం లేదు. ఇయ్యాల అమ్మ యాదికొచ్చింది. రేయ్ మీకు యాదికొచ్చింది అమ్మ కాదు . ఆమె వెనక ఉన్న రెండకరాలు. దానికోసం ఇంతనాటకం ఆడుతుండ్రు' అన్నడు.

మాటా మాటా పెరిగింది. బావమరుదులు మాట్లాడే తీరుకు రాంకిషన్‌రావు మనసు నొచ్చుకుంది. సుగుణమ్మ పానం విలవిలలాడింది.

'రేయ్ ఇయ్యాల అమ్మ రెండకరాలు చూసి మాట్లాడుతుండ్రు. పదేండ్ల బట్టి సాత్తున్నం. ఏ ఆశించిరా. ఇయ్యాల కోటి రూపాల ఆస్తి అయింది. ముందే తెలిసి సాదిన మంటరా? ఇయ్యాల సొమ్ము చూసేసరికి నాలికకు నరం లేకుంట మాట్లాతుండ్రు' సుగుణమ్మ నాలుగు దులిపింది.

'ఏది ఏమైనా ఆస్తి కోసమే మీ నాటకాలు. అమ్మను అడ్డం పెట్టుకొని ఆడిస్తుండ్రు.' వెంకటేశం ఉక్రోశంగా అన్నడు.

సుగుణమ్మకు దుఃఖం తన్నుకొచ్చింది.

రాంకిషన్‌రావుకు అవమానంగా అనిపించింది. అట్టాగని ముసలమ్మను పంపాలనిపించలేదు. నాలుగు పైసలు ఉన్నయని తెలిసి తల్లి కోసం వచ్చినోల్లు. ఆ పైసలు చేతుల్ల పడగానే తల్లి గొంతుపిసికి చంపినా దిక్కులేదు అనిపించింది.

ముసలమ్మను తోలకుంటే లోకం తనను వేలెత్తి చూపుతుంది.

'ఇంగో సుగుణా! అడ్డమైనోనితోని మాటలు పడాల్సిన పనిలేదు. ఇంతపరువుతోని బతికేటోళ్లం. మీ అమ్మ ఆస్తి ఉందని మనం తీస్కరాలే. ఇయ్యాల ఆమెకు పోవాలనిపిస్తే పొమ్మను. ఉండాలనిపిస్తే ఉండమను. కాని ఒక మాట ... నలుగురి నోళ్లల్ల పడటం మాత్రం నాకిష్టం లేదు. అదికూడా అలోచించమను' అన్నడు.

శాంతమ్మకు అల్లుని మనసు అర్థమైంది. తనేం చేయాలో అల్లుడు మాటల్లో చెప్పకనే చెప్పిండు.

ఆనందం ... మరోవైపు కొడుకుల ప్రవర్తన తీరు... అసహ్యం....

'అమ్మ కొడుకులు కార్రా మీరు. ఆస్తి కొడుకులు' అని రపరప ఇంట్లెకు పోయింది శాంతమ్మ .

*